ప్రజాశక్తి

సోమవారం 28 నవంబర్ 2022 8 పేజీలు




గుంటూరు పల్నాడు

లక్షలు మింగినా మీనమేషాలు!



- నిధులను ఉద్యోగి దారి మళ్లించిన ఘటనపై నిర్లిప్తత
- పోలీసులకు వివరాలివ్వని కార్పొరేషన్ అధికారులు
- ఎఫ్ఐఆర్ నమోదు కాకున్నా అయినట్లు ప్రకటన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్‌లో ఎకౌంట్స్ విభాగం పెద్ద ఎత్తున నిధులు దారి మళ్లినట్టు నిర్ధారణ అయినా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. ఈనెల 3వ తేదీన ఎక్సౌంట్స్ విభాగంలో నిధుల దారిమళ్లించిన ఉద్యోగి సిరిల్‌పాల్‌ను సస్పెండ్ చేసిన కమిషనర్ చేకూరి కీర్తి సైబర్ విభాగానికి ఫిర్యాదు చేస్తామని, క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎస్‌పికి లేఖ రాస్తానని తెలిపారు. ఈ అంశంపై పోలీసులకు తగిన వివరాలు ఇవ్వకపోవడంతో లాలాపేట పోలీసులు ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదు. అయితే కింది స్థాయి అధికారులు కమిషనర్‌కు ఫిర్యాదు ఇచ్చామని, ఎఫ్ఐఆర్ నమోదు చేశారని మాత్రం తప్పుడు సమాచారం ఇచ్చారు. మూడ్రోజుల క్రితం జరిగిన మీడియా సమావేశంలో పోలీసు కేసు

▸ 2లో

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళులు

పలుచోట్ల సంతాప సభలు - అన్నదానం

8 లో

ఘనంగా ముగిసిన వీరారాధనోత్సవాలు

4 లో

24 గంటల్లోనే రైతులకు సొమ్ము

- మిర్చి యార్డులో పక్కాగా ఈ-నామ్
- జనవరి నుంచి కొత్త సరుకు ఆగమనం
- దిగుబడి తగ్గడం వల్ల ధరలు పెరుగుదల
- ప్రజాశక్తితో గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి

8 లో



సామాన్యులను రాజకీయాల్లోకి తెచ్చిన ఎన్‌టిఆర్

- లోక్‌సత్తా నేత జయప్రకాశ్ నారాయణ
- జయప్రదకు ఎన్‌టిఆర్ శతాబ్ధి చలనచిత్ర పురస్కార ప్రదానం

వార్త మెయిన్‌లో

సినీఫక్కీలో కిడ్నాప్

అదేతరహాలో నిలువరించిన పోలీసులు

2 లో



ఉండవల్లిలో నిత్యం ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి - తాడేపల్లి

రాజధాని ముఖద్వారమైన ఉండవల్లి పంచాయతీ కార్యాలయం సమీపంలో నిత్యం ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుంది. ఇటు సెంటర్ వైపు, అటు ఉండవల్లి గృహలవైపు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఉండవల్లి సెంటర్ నుండి సుందరయ్యచౌక్ వరకు డబల్‌రోడ్డు నిర్మాణం జరిగింది. అక్కడ నుండి సుమారు వెయ్యి గజాల దూరం సింగిల్‌రోడ్డు ఉంది. మధ్యలో డ్రెయినేజీ నీరుపోవడానికి కల్వర్టు ఏర్పాటు చేశారు. ఇక్కడే నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతుంది. ఉదయం 8.30 ప్రాంతంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీతోపాటు అమరావతి-తుళ్ళూరు వెళ్ళే బస్సులు విజయవాడ-సచివాలయం, హైకోర్టుకు వెళ్ళే బస్సులతోపాటు విఐపిలు, వివిఐపిలు నిత్యం ఈ మార్గంలో వాహనంలో రాకపోకలు చేస్తుంటారు. ఉదయంపూట ప్రతిరోజు కిలోమీటరుమేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనచోదకులతోపాటు ప్రయాణీకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఉండవల్లిలో ఈ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులతోపాటు వాహనదారులు కోరుతున్నారు.



ఉచితంగా కంటి పరీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక విజెపి అండ్ డిఎల్‌బి డిగ్రీ కళాశాలలో వీసం నాగేశ్వరావు జయప్రద వెల్ఫేర్ సొసైటీ, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సహకారంతో ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కళ్ళజోడులను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల డైరెక్టర్ వివి ప్రసాద్, ప్రిన్సిపల్ డి శ్రీనివాసరావు, వైద్యులు రియా, స్పందన, లతా, కళాశాల టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది, నలంద ఒకేషనల్ జూనియర్ కళాశాల నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్ విద్యార్థులు పాల్గొన్నారు



శేషగిరిరావు కుటుంబానికి ఎమ్మెల్యే శ్రీదేవి పరామర్శ

ప్రజాశక్తి - తుళ్లూరు

వైసిపి జిల్లా ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి,దొండపాడుకు చెందిన కొప్పుల శేషగిరిరావు సతీమణి కొప్పుల బుజ్జి ఆదివారం మృతి చెందారు .విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఆదివారం దొండపాడులోని శేషగిరిరావు నివాసానికి వెళ్లి బుజ్జి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేషగిరిరావును పరామర్శించారు. అనంతరం బుజ్జి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,వైసిపి అభివృద్ధికి తొలి నుంచి ఆయన కుటుంబం కృషి చేసిందని చెప్పారు. వారి కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు అంతకు ముందు వైసిపి జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ బుజ్జి మృతదేహానికి అంజలి ఘటించారు .శేషగిరిరావు కుటుంబసభ్యులను ఓదార్చారు.

సినీ ఫక్కీలో కిడ్నాప్

- **అదేతరహాలో నిలువరించిన పోలీసులు**
- **తోటలో రౌడీమూక ఘర్షణ**

ప్రజాశక్తి - దుగ్గిరాల

సంబంధం లేని వ్యవహారంలో తలదూర్చిన దుండగులు దాడి చేయడంతోపాటు ఒకర్ని కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన ఘటన మండలంలోని కంఠంరాజు కొండూరులో ఆదివారం కలకలం సృష్టించింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. కంఠంరాజు కొండూరు గ్రామ శివారులోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ సమీపంలోని తోటకు ఆదివారం వన భోజనాల నిమిత్తం వివిధ ప్రాంతాల వారు వేర్వేరుగా వచ్చారు. వీరిలో విజయవాడ వన్‌టౌన్ చెందిన 20 మందికి పైగా వచ్చారు. సాయంత్రం 4 గంటలప్పుడు భోజనాలు చేస్తుండగా వీరిలో ఒక పిల్లవాడు అన్నం తింటూ కూర కోసం మారం చేశాడు. అయితే కూర అప్పటికే అయిపోయిందని తండ్రి మందలింపు ధోరణిలో సర్ది చెబుతున్నాడు. ఇది చూసిన విజయవాడకే చెందిన కొందరు కలుగజేసుకుని గొడవకు దిగారు. కొద్దిసేపటికి సైకిల్ చైను, ముళ్లున్న బెల్టుతో దాడికి పాల్పడ్డారు. దీంతో మజ్జి దుర్గారావు అనే వ్యక్తి తలకు, వేముల వెంకటేశ్వరరావుకు ముఖంపైన గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా తన మెడలో చైనును లాక్కున్నారంటూ అల్లరి మూకలోని ఒక వ్యక్తి మళ్లీ గొడవకు దిగాడు. చైను ఖరీదు రూ.1.8 లక్షలని, దాన్ని ఇవ్వకుంటే ఈ అబ్బాయిని చంపేస్తామంటూ తేజ అనే యువకుణ్ణి లాక్కెళ్లి కారులో ఎక్కించుకుని పరారయ్యారు. తొలుత చిలువూరు వద్ద రైల్వే గేటు వైపు వెళ్లినా అక్కడ గేటు పడి ఉండడంతో వాహనాన్ని వడ్లపూడి మీదుగా దారి మళ్లించారు. ఇదంతా గమనిస్తున్న పోలీసులు.. వాహనాన్ని వెంబడించినా వారు చిక్కలేదు. దీంతో ఎస్ఐ ఎ.శ్రీనివాసరెడ్డికి సమాచారం అందించారు. తుమ్మపూడి వద్ద ఎస్ఐ కాపుకాయడంతో దుండగులు మళ్లీ దారి మార్చారు. ఈ విషయాన్ని మంగళగిరి, తాడేపల్లి ట్రాఫిక్ పోలీసులకు దుగ్గిరాల ఎస్ఐ సమాచారం ఇచ్చారు. కారు నంబర్ ఆధారంగా తాడేపల్లి వద్ద ట్రాఫిక్ పోలీసులు కారును నిలువరించారు. దీంతో దుగ్గిరాల ఎస్సై అక్కడికి వెళ్లి కిడ్నాప్ గురైన యువకుడితోపాటు వాహనంలో ఉన్న దొంతిరెడ్డి సాంబశివరెడ్డి, గోలి నరసింహ, బకిని వెంకటసాయి, గోనేటి ఈశ్వర్‌కుమార్‌ను అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

లక్షలు మింగినా మీనమేషాలు!

(మొదటి పేజీ తరువాయి)

గురించి కమిషనర్‌ను ప్రశ్నించగా ఇప్పటికే కేసు నమోదైందని, ఎఫ్ఐఆర్ మీడియాకు పంపుతానని ప్రకటించారు. కానీ ఇంత వరకు ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని లాలాపేట పోలీసులు తెలిపారు. తాము అడిగిన వివరాలు ఇవ్వలేదని పోలీసులు చెబుతున్నారు. ఈ అంశంపై కింది స్థాయి అధికారులు కమిషనర్‌కు తగిన సమాచారం ఇవ్వలేదని తెలిసింది.

ఎకౌంట్స్ విభాగం ద్వారా కాంట్రాక్టర్లకు, ఉద్యోగులు, వివిధ సంస్థలకు చెల్లించాల్సిన సొమ్మును ఇతర ఖాతాలకు మళ్లించి దాదాపు రూ.60 లక్షలు వరకు స్వాహా చేసిన ఉదంతంపె వివిధ రూపాల్లో విచారణ జరిపించాలని గత నెలలోనే కమిషనర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలుత ఎకౌంటెంట్‌గా బాధ్యత నిర్వహించి ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా సిరిల్ పాల్‌ను ప్రధాన సూత్రదారిగా గుర్తించారు. నగరపాలక సంస్థ అకౌంట్స్ విభాగంలో అవినీతిని గుర్తించి నెల రోజుల పాటు అంతర్గత విచారణ చేయించారు. ప్రాథమిక విచారణలో రూ.47 లక్షల, 9 వేల, 599 స్వాహా చేసినట్టు గుర్తించామని కమిషనర్ ప్రకటించారు. సిరిల్‌పాల్‌తోపాటు మరికొంత మంది ఉద్యోగులు, అధికారుల పాత్ర కూడా ఉందని సందేహాలు రావడంతో ఈ దిశగా విచారణ చేయిస్తున్నారు. మరో ఉద్యోగిపై చర్యలు తీసుకోబోతున్నారని ప్రచారం జరిగినా గత 24 రోజుల్లో చర్యలేమీ తీసుకోలేదు. తొలుత సైబర్ క్రైం పోలీసుల చేత దర్యాప్తునకు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్‌కు లేఖ రాశారు. కానీ కిందిస్థాయి పోలీసు అధికారులు మాత్రం తమకు పూర్తి వివరాలు కావాలని అడగటంతో ఎక్కౌంట్స్ విభాగం పర్యవేక్షించే అధికారులు మౌనం దాల్చారు. సిరిల్‌పాల్‌ను సస్పెండ్ చేసిన రోజే ఈనెల 3వ తేదీన ఈ కుంభకోణంలో మరో పాత్రదారిగా ఉన్న గతంలో పనిచేసిన ఎగ్జామినర్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఆయనపై ఇంకా చర్యలు తీసుకోలేదు. ఈ కుంభకోణం మొత్తం వ్యవహారాన్ని కమిషనర్ పరిశీలిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.

'బలహీన వర్గాలకు అండగా ఉంటాం'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బిసిలంటే వెనుకబడిన వర్గాలు కాదని సమాజానికి వెన్నెముక వర్గాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడోజు నాగేశ్వరాచారి ఆధ్వర్యంలో ఆదివారం కొంత మంది విశ్వబ్రాహ్మణులు టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. బృందావన్ గార్డెన్స్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరి సమక్షంలో వారు పార్టీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే మద్దాళిగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అప్పిరెడ్డి మాట్లాడుతూ వైయస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాలకు అండగా ఉంటామని అన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ ద్వారా రాష్ట్రంలో బీసీల చరిత్ర గతిని మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి మార్చారని లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు.మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. గుంటూరులో విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ, బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూసిన వ్యక్తి చంద్రబాబు అని ఆరోపించారు. పార్టీ సీనియర్ నాయకులు బందా రవీంద్రనాథ్, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అంగలకుదురు సుశీల, సంఘం జిల్లా అధ్యక్షులు ఉమ్మడోజు నాగేశ్వరాచారి, సంఘం నేతలు కందేపు వెంకట్రావు, సీహెచ్. రాజ్యలక్ష్మి, అద్దంకి భద్రయ్య, కార్పొరేటర్లు యక్కల మారుతీ, ఈచంపాటి వెంకటకష్ణ (ఆచారి), షేక్ రోషన్, పడాల సుబ్బారెడ్డి, అచ్చాల వెంకటరెడ్డి, కాండ్రకుంట గురవయ్య, పార్టీ నేతలు గులాం రసూల్, మద్దుల రాజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సిఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ , ఎస్‌పి, తదితరులు

రేపు గుంటూరుకు సిఎం రాక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు, సినీ నటుడు అలీ కుమార్తె రిసెప్షన్‌లో పాల్గొనేందుకు సిఎం వైఎస్ జగన్ ఈ నెల 29న గుంటూరురానున్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో శ్రీ కన్వెన్షన్ కళ్యాణ మండపంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. సిఎం రాక సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్, ఇతర అధికారులతో కలసి ఆదివారం పర్యటించారు. భద్రతా చర్యలు సెక్యూరిటీ పరంగా పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ రెగ్యులేషన్ తదితర విషయాలపై చర్చించారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, సౌత్ డిఎస్‌పి జెస్సీ ప్రశాంతి, పశ్చిమ ఇన్‌ఛార్జి డిఎస్‌పి ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బులియన్ గోల్డ్ సిల్వర్ అండ్ డైమండ్ అసోసియేషన్ సెక్రటరీగా సయ్యద్ గౌస్

ప్రజాశక్తి- పొన్నూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ బులియన్ గోల్డ్,సిల్వర్ అండ్ డైమండ్ అసోసియేషన్ సెక్రటరీగా పొన్నూరు పట్టణానికి చెందిన సయ్యద్ గౌస్ ఎన్నికయ్యారు. గతంలో పొన్నూరు బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షునిగా, గుంటూరు జిల్లా బులియన్ మర్చంట్ ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా అనేక పదవులు అధిరోహించిన సయ్యద్ గౌస్ ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో సెక్రటరీ పదవి లభించడం పట్టణానికి గర్వకారణం అని పలువురు వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సయ్యద్ గౌస్ మాట్లాడుతూ స్థాయిలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ ప్రతిష్టను పెంచే విధంగా పని చేస్తానన్నారు తన ఎన్నికకు కషిచేసిన ఏపీ బులియన్ గోల్డ్ ,సిల్వర్ అండ్ డైమండ్ అసోసియేషన్ అధ్యక్షులు కపిలవాయి విజయ్ కుమార్ , ఏపీ చీఫ్ ఆర్గనైజర్ శాంతి లాల్ జైన్ లను ఆయన ధన్యవాదములు తెలిపారు. పలువురు ఆయనను పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు.పొన్నూరు బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు సంకా మల్లికార్జునరావు, సెక్రటరీ షేక్ బాజీ బాబా అలీషా, ట్రెజరర్ మహమ్మద్ ఖాసిం, వైస్ ప్రెసిడెంట్ బర్కత్, బులియన్ మర్చంట్ సీనియర్ సభ్యులు సయ్యద్ అబ్దుల్ ఖయ్యూం, షేక్ మక్బుల్, షేక్ షఫాహితుల్లా, షేక్ సలాం, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



వైసిపి నుండి టిడిపిలోకి..

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాత్రి టిడిపిలోకి చేరారు. స్థానిక కొత్తపేటలోని టిడిపి కార్యాలయంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ 25 మంది యువకులకు పార్టీ కండువా కప్పి స్వాగతించారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో షేక్ సుబాని, నాజర్, మహబూబ్ సుభాని, జాన్‌సైదా, సాయిరాం, సమీర్, అల్లాడి అఖిల్, కరిముల్లా, ఆదిత్య తదితరులున్నారు. కార్యక్రమంలో నాయకులు నల్లిబోయిన నాగేశ్వరరావు, పఠాన్ నాగుల్‌మీరా, పందినారాయణ, షేక్ జిలాని, సుద్దపల్లి రవీంద్ర పాల్గొన్నారు.

పూల వ్యాపారి దారుణ హత్య

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

పూల వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు.పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన షేక్ శిలార్ ఉరఫ్ నన్నే (57) ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శిలార్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి గురు తెలియని వ్యక్తులు గొడ్డలితో నరికి హత్య చేశారు. భార్య మస్తాన్ బీ తో కలిసి బయట గదిలో నిద్రిస్తుండగా కొడుకు ఖైరుల్లా, కోడలు లోపలి గదిలో నిద్రపోతున్నారు. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో 'మీ నాన్నను ఎవరో ఏదో చేశారు' అంటూ మస్తాన్ బీ కొడుకును లేపింది. ఖైరుల్లా చూసేసరికి తండ్రి శిలార్ రక్తపు మడుగులో మృతి చెంది వున్నాడు. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సత్తెనపల్లి డిఎస్పీ ఆర్.విజయ భాస్కర్ రెడ్డి రూరల్ సిఐ రామిశెట్టి ఉమేష్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యుల నుండి వివరాలు సేకరించారు. గుంటూరు నుండి క్లూస్ టీమ్ ను డాగ్ స్క్వాడ్ పోలీసులు రప్పించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. పోలీసు జాగిలం మృతుడి ఇంటి పరిసర ప్రాంతాల్లో సంచరించింది. హత్యపై భిన్న కథనాలు విని పిస్తుండగా కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు. హత్యకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఖైరుల్లా ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ కేసు నమోదు చేశారు. రూరల్ సిఐ ఆర్. ఉమేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిఎస్పీ విజయభాస్కరరెడ్డి



ఆశ్రమాల్లో అన్నదానం

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

గత 53 సంవత్సరాలుగా రైతు సేవలో, రైతుల మన్ననలు పొంది, రైతుల చే నమ్మకం చేకూ ర్చుకున్న ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ 53 సంవత్సరాలు పూర్తి చేసుకుని 54 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ ఆవరణలో, శ్రీ సాయి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం అనంతరం ఏరీస్ కంపెనీ ప్రతినిధులు కంపెనీ ఉద్దేశించి విజయానికి మూల సూత్రాలైన నమ్మకం, నాణ్యత, విలువలు, విశ్వాసం, దఢ సంకల్పం, ఐక్యత, కాలానికి అనుగుణంగా సంస్థను విజయతీరాల వైపు ఎదగటానికి మూల స్తంభాలుగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రస్తుత పంట యొక్క పరిస్థితులు గురించి తెలుసుకొని రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ జి అమరయ్య, జి రాజేష్ , ఎస్ శ్రీనివాసరావు, పవన్ ట్రేడర్స్ యాజమాన్యం శివన్నారాయణ, జగన్ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

ప్రజాశక్తి-నాదెండ్ల

ఏరిస్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం నైస్ అనాథ పాఠశాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏరిస్ కంపెనీ 54వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు కంపెనీ ప్రతినిధి పి.శంకరరావు తెలిపారు. సరైన పోషక విలువలు లేని ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో నైస్ విద్యాసంస్థల డైరెక్టర్ బి.సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



మూసుకుపోయిన రహదారులు

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

ముళ్ళ పొదలతో రహదారులు మూసుకుపోయాయి. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ – దీపాలదిన్నెపాలెం మధ్య ముళ్ళ పొదలు పెరగటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనితోపాటు రోడ్డు మలుపులు ఉండ టంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచు వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. రాత్రివేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించే క్రమంలో ముళ్ళ పొదలు గీసుకుని తీవ్రంగా గాయపడుతున్నారు.ముళ్ళ పొదలతో వాహనదారులు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.ముళ్ళ పొదలను తొలగించాలని అధికారులను డిమాండ్ చేస్తున్నారు.



లారీ ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు నగర శివారు బుడంపాడు సెయింట్ మేరీస్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఆదివారం వేకువ జామున రోడ్డు ప్రమాదం జరిగింది. సంఘటనలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మతులు ఇరువురు ద్విచక్ర వాహనంపై చేబ్రోలు మండలం శలపాడు నుంచి ద్విచక్ర వాహనంపై గుంటూరు వస్తున్నారు. గుంటూరు నుంచి తెనాలి వైపునకు కోళ్లను తీసుకుని వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొనడంతో వీరు ఇద్దరు వెళ్లి రోడ్డు పక్కనకాల్వలో పడి మృతి చెందారు. లారీ కూడా అదుపు తప్పి బోల్తా పడింది. లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మృతి చెందిన వారిని మేడాఏసు(55), ఏసు సమీప బంధువు బొప్పూడి వెంకాయమ్మ (48) గా గుర్తించారు. నల్లపాడు సిఐ బత్తుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-తెనాలిరూరల్



పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. రూరల్ ఎస్ఐ వెంక టేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రామలింగేశ్వరపేట, గురవయ్యకాలనీ శివారు ప్రాంతంలో పేకాడుతున్న సమాచారంతో ఆదివారం తెల్ల వారుజామున పోలీసులు దాడి చేశారు. పేకాట బృందాన్ని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.24,120, నాలుగు బైక్‌లు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరు స్తామని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి-ఈపూరు : మండలంలోని బొమ్మరాజుపల్లి నుండి చేజర్ల వెళ్లే రోడ్డు మార్గంలో గంగమ్మ గుడి సమీపంలో పేకాట ఆడు తున్నారన్న సమాచారంతో శనివారం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు దాడులు చేశారు. ఈ దాడులలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 17,000, 9 సెల్ ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని ఈపూరు పోలీస్ స్టేషన్ ఎస్సై వి.వెంకట్రావుకు అప్పగించారు. ఏడుగురిపై కేసు నమోదు చేశామని కోర్టు హాజరుపరచనున్నారు.

దమ్మాలపాడులో పట్టపగలే చోరీ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో డబ్బురి రామస్వామి ఇంట్లో శనివారం పట్టపగలు దొంగతనం జరిగినది.పత్తి అమ్మి డబ్బులు ఇంట్లో పెట్టి కుటుంబసభ్యులతో కలసి పొలం పనికి వెళ్ళిన రామస్వామి శనివారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలగొట్టి ఉన్నాయి.లోపలికి వెళ్లి పరిశీలించగా గదిలోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి.బీరువాలోని దుస్తులు కూడా తొలగించి లాకర్ లోని ఉన్న డబ్బులు 1లక్ష పదిహేడు వేల రూపాయల డబ్బులను మరియు ఒక వాచ్ పోయినట్లు గుర్తించి పోలీసు వారికి ఫిర్యాదు చేశారు.విషయం తెలుసుకుని సంఘటన స్థలాన్ని ఎస్ఐ పట్టాభి రామయ్య పరిశీలించారు. క్లూస్ టీం ను తెప్పించి వివరాలు సేకరించారు.పట్టపగలు దొంగతనం జరగడం పట్ల గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



కాల్వలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో చెత్త ట్రాక్టర్ బోల్తా కొట్టింది. మార్కెట్ నుంచి బస్టాండ్‌కు వెళ్ళే మెయిన్‌రోడ్డులో చెత్తలోడుతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ ఫుట్‌పాత్‌ను ఢీ కొంది. ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ మధ్యకాలువలోకి దూసుకుపోగా, ట్రక్కు రోడ్డుపై పడిపోయింది. ప్రైవేటు ట్రాక్టర్ నడిపే వ్యక్తి చెత్తలోడుతో వెళుతున్నాడు. ఆదివారం కావటంతో కుమారుడిని కూడా ట్రాక్టర్‌పై పక్కనే కూర్చోబెట్టుకున్నాడు, సాంకేతిక లోపంతో కాలువలోకి దూసుకుపోవటంతో డ్రైవర్ ట్రక్కుతో సహా ఫుట్‌పాత్‌పై పడిపోగా, కుమార్డు ఇంజన్‌తో సహా కాలువలో పడిపోయాడు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ కాలువలో దూకి, కుమారుడిని రక్షించుకున్నాడు. ఈలోగా అక్కడి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఘటనతో ఎలాంటి ప్రమాదం లేకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తొలుత మున్సిపల్ ట్రాక్టర్‌గా భావించినా, అది చివరకు ప్రైవేటు ట్రాక్టర్‌గా తేలింది. ఓ ప్రైవేటు సంస్థకు చెందిన చెత్తను ట్రాక్టర్‌లో తరలిస్తున్నట్లు సమాచారం.




బాలుర,బాలికల, జిల్లా జట్లతో సెలక్షన్ కమిటీ సభ్యులు

ఉమ్మడి గుంటూరు జిల్లా బాల,బాలికల ఖోఖో జట్ల ఎంపిక

ప్రజాశక్తి-నకరికల్లు

ఉమ్మడి గుంటూరు జిల్లా బాలుర, బాలికల, ఖోఖో జట్లను ఆదివారం ఎంపిక చేశారు. స్థానిక వంగా వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరిగాయి. ఖోఖో అసో సియేషన్ సభ్యులు రావు కిషోర్ మాట్లాడుతూ డిసెంబర్ 9 నుంచి 11 వరకు కర్నూలు జిల్లా ఆత్మకూరులో జరిగే రాష్ట్ర స్థాయి 32వ జూనియర్ ఇంటర్ జిల్లా పోటీలకు ఈ జట్లు హాజరవుతాయని తెలిపారు. జట్లను ఎంపిక చేసిన వారిలో ఖోఖో జిల్లా కోఆర్డినేటర్ దాసరి కోటేశ్వరరావు, జాప్ డిప్యూటీ డైరెక్టర్ నరసింహారెడ్డి,జిల్లా వైస్ ప్రెసిడెంట్లు భద్రారెడ్డి, యూన్సీరాణి, పీడీలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, అంకయ్య, శ్రీనివాసరావు, రత్తయ్య, ఆంజనేయులు, జానకిరామయ్య పాల్గొన్నారు.


భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఐఎంఎ భవన నిర్మాణం వైద్యుల కల

ప్రజాశక్తి- నరసరావుపేట

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) భవనం వైద్యుల కల అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పెద్దచెరువు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఇండి యన్ మెడికల్ అసోసియేషన్ భవ నాన్ని ఆదివారం ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నాళ్ల నుంచో ఎదురుచూస్తున్న డాక్టర్ల కలల సౌధం అని, డాక్టర్ల అసో సియేషన్ భవన నిర్మాణాన్ని జిల్లాలోనే అద్భుతంగా తీర్చి దిద్దే విధంగా పని చేయాలని సంఘం సభ్యులకు సూచించారు. డాక్టర్ జి.బ్రహ్మారెడ్డి, డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎ.రామ మోహన్‌రావు, డాక్టర్ పి. గోపాలకృష్ణమూర్తి, ఇంజనీర్ కమలాకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్నాటి ఉత్సవాలకు రాజకీయ రంగు పులమడం సరికాదు : టిడిపి

ప్రజాశక్తి-కారెంపూడి

ఎంతో చరిత్ర కలిగిన కారెంపూడి పల్నాటి వీరారాధనోత్సవాలకు రాజకీయం పులమడం సరికాదని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కారంపూడిలో గత నాలుగు రోజుల నుండి వీరా రాధనోత్స వాల సందర్భంగా అధి,కార పార్టీ నాయకులు మాత్రమే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారని, ప్రతిపక్షం పార్టీ నాయ కులు ఏర్పాటు చేసిన కొన్ని ఫ్లెక్సీలను పంచాయతీ కార్యదర్శి కాసిన్నా నాయక్ తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలు రాజకీయ పార్టీలకు అతీతంగా జరుగుతాయని, టిడిపి అధికారంలో ఉన్నప్పుడు వైసిపి నాయకులు కూడా వారి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారని అన్నారు.

ఘనంగా ముగిసిన వీరారాధనోత్సవాలు


రాత్రి వేళ ఆరుబయటే చలిలో నిద్రిస్తున్న సందర్శకులు

ప్రజాశక్తి -కారెంపూడి

పల్నాటి వీరారాధనోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం నాడు కలిపాడు ఘనంగా జరిగింది. ప్రాణం లేని లంకన్నకు ప్రాణ భిక్ష బ్రహ్మనాయుడు పెట్టాడు. గతంలో జరిగిన చరిత్రను సాక్షత్కరిస్తుంది వీర మరణం పొందిన లంకన్న వేష ధారణలో విద్యాపస్తు, సజీవ దహనంగా పడుకొని ఉంటుంది. బ్రహ్మనాయుడు గా ఉన్న పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవయ్య వారు ప్రాణ భిక్ష పెట్టిన సంఘటన జరిగింది. తెలుగు రాష్ట్రాలలో ఉన్న వీరాచారవంతులు తమ కొణతములతో ఉత్సవాలలో పాల్గొన్నారు. వీర్ల , వీర్లంకమ్మ, చెన్నకేశవస్వామి దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. పోతురాజు గుట్ట వద్ద ఉన్న కళ్లి తంగడ మండలపై దైవాలు (కొణతములు) ఒరగడంతో ఉత్సవాలు ముగిశాయి. నాగులేరు(గంగధారి మడుగు) స్నానమాచరించారు.పీఠాధిపతి ఇచ్చిన తీర్థం తీసుకొని ప్రజలు తమ గ్రామాలకు తరలి వెళ్లిపోయారు. గత ఐదు రోజుల నుండి ఘనంగా జరిగాయి పల్నాటి ప్రాంతంలోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు,వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆచారవంతులు, పిన్నలు,పెద్దలు కన్నమనీయులు అధిక సంఖ్యలో ఉత్సవాలలో పాల్గొన్నారు.


పోటీల్లో భాగంగా బండను లాగుతున్న ఎడ్ల జత

ఎడ్ల పందేలను ప్రారంభించిన మంత్రి

పల్నాడు అంటేనే సంస్కృతీ సంప్రదాయాలకు పురిటిగడ్డ అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పల్నాటి వీరారాధన ఉత్సవాలు చివరి రోజులో భాగంగా జాతీయస్థాయి ఎడ్ల పందేలను ఆదివారం మంత్రి ప్రారంభించారు. 850 ఏళ్లుగా ఈ ఉత్సవాలు నిరాటంకంగా జరుగు తున్నాయని, చరి త్రను కాపాడుకుంటూ ఉత్సవాలు నిర్వ హించినందుకు పల్నాటి ప్రాంత ప్రజలకు కృతజ్ఞతలని చెప్పారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లా డుతూ తొమ్మిదేళ్ల నుండి ఎడ్ల పందేలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి, మాచర్ల మున్సి పల్ చైర్మన్ టి.కిషోర్, ఎంపిపి ఎం.శారద శ్రీనివాస్‌రెడ్డి, జెడ్‌పిటిసి షఫీ, బి.అల్లయ్య, పి.రామిరెడ్డి, కె.చంద్రశేఖర్, యు.గిరి, ఆర్.ప్రమీలబాయ్ తేజనాయక్, జి.పూర్ణయ్య, వి.లింగయ్య పాల్గొన్నారు.

వసతులు కరువు..

'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్న చందాన వీరారాధనా ఉత్సవాలు జరిగాయి గత ఐదు రోజుల నుండి జరిగిన పల్నాటి వీరారాధన ఉత్సవాలకు వసతులు కరువయ్యాయి. ప్రజలు తాగేందుకు నీటి సౌకర్యం కూడా లేని పరిస్థితి నెలకొంది. నాగులేరులో ఉన్న నీటిని స్నాన ఘట్టాలకు ఉపయోగించి అదే మురుగునీరు నాగులేరులోకే పంపించే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు. నాగులేరులో ఆచారవంతులు స్నానం చేయటం ఆచారం అలాంటి ఆచారాన్ని కూడా అధికారులు విస్మరించారు. మహిళలకు మరుగుదొడ్ల లేక ఇబ్బందులకు గురైన సంఘటనలు ఉత్సవాలలో నెలకొన్నాయి. ఆచారవంతులకు కనీసం నిలవ నీడ కూడా లేకుండా పోయింది రాత్రుల సమయంలో చలిగాలులోనే వీర్ల దేవాలయ ప్రాంగణంలో బస చేశారు. ఆచారవంతులపై అధికారులకు ప్రజాప్రతినిధులకు కనీసం కనికరం కూడా లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. వీర్ల దేవాలయ ప్రాంగణంలో వివిధ స్టాల్స్,షాపీ, ఆట వస్తువులకు వేల రూపాయలు తీసుకుంటున్న కనీస వసతులు కల్పించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి డబ్బులు వసూలు చేసి ఎవరికి పెడుతున్నారు అనేది ఇంతవరకు అర్థం కాని పరిస్థితి.

వీరారాధన ఉత్సవాలపై పరిశోధన

తెలుగు విశ్వవిద్యాలయం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న

అలనాటి వీరారాఘవ ఉత్సవాలపై పరిశోధన చేసినట్లు హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న తెలిపారు.ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయుధాలకు పూజలు చేయడం రోమ్ నగరంలో, ఆంధ్రప్రదేశ్‌లోని కారెంపూడిలో మాత్రమే జరుగుతాయని అన్నారు. ఐదు రోజుల పల్నాటి వీరుల తిరణాలపై పరిశోధన చేసినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో ఉన్న జాతర్లు, గిరిజన పండుగలు, జానపద సంస్కృతి వంటి అంశాలపై పరిశోధన చేసినట్లు చెప్పారు. పల్నాటి చరిత్రను డాక్యుమెంటరీ రూపంలో దేశంలోని నలుమూలలకు విస్తరింప చేసే విధంగా తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో చేపడతామని అన్నారు. సమావేశంలో అని స్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్, డాక్టర్ రవికుమార్, దామోదర్ పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు చేకూరి లక్ష్మీకాంతారావు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఆదర్శ కమ్యూనిస్టు చేకూరి లక్ష్మీ కాంతారావు అని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. ఈ నెల 13న అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు ప్రముఖ న్యాయవాది చేకూరి లక్ష్మీ కాంతారావు సంస్మరణ సభ ఆదివారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో నిర్వహించారు. గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ కాంతారావు కార్మిక, కర్షక, పీడిత ప్రజల శ్రేయస్సుకు పాటుపడ్డారని, ఆయన ఆశయాలను సిపిఎం ముం దుకు తీసుకుపోతుందని అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గద్దె చలమయ్య, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి,సిలార్ మసూద్, వెంకటేశ్వర్లు,గుంటుపల్లి బాలకృష్ణ, గద్దె ఉమశ్రీ, డి.శివకుమారి,విమల న్యాయవాది బి.సలీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

8న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- పెదకూరపాడు

పెదకూరపాడు మండల సర్వసభ్య సమావేశం డిసెంబర్ 8న జరుగుతుందని ఎండిఓ నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల అభివృద్ధిపై సమీక్ష ఉంటుందన్నారు. భవిష్యత్తు ప్రణాళికపై నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది కనుక ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

'లంపి స్కిన్'.. పాడిరైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-ముప్పాళ్ల



మండలంలోని గ్రామాల్లో లంపి స్కిన్ వ్యాధి వేగంగా విస్తరిస్తుండటంతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలో 50 కి పైగా ఆవులు, ఆవు దూడలు, ఎద్దులు ఈ వ్యాధి బారిన పడినట్లు సమాచారం. దీని బారినపడ్డ పశువుల ఒంటిపై దద్దులు, వాపులతో పెద్ద పెద్ద పుండ్లు ఏర్పడుతున్నాయి. వాటి నుండి చీముతో కూడిన నెత్తురు కారుతుంటుంది. ఎన్ని రకాల మందులు వాడిన ఫలితం కనబడటం లేదు. దాదాపుగా మూడు నెలల కాలం నుండి దేశంలో ఈ వ్యాధి ఆనవాళ్లు కనిపిస్తున్న ఎలాంటి వ్యాక్సిన్ కనుగొనబడలేదు. కానీ గొర్రెలు, మేకలలో కనబడే గోట్ పాక్స్ వ్యాధి మాదిరిగానే ఉండటంతో పశు సంవర్ధక శాఖ అధికారులు ఇదే వ్యాక్సిన్ ను మండలం లోని గొర్రెలు, మేకలతో పాటు ఆవులు, కోడె దూడలతో పాటు ఇతర పశువులకు వేస్తున్నారు. అయినప్పటికీ లంపి స్కిన్ వ్యాధి అదుపులోకి రాకపోగా ఇతర పశువులకూ వ్యాపిస్తోంది. ఎన్ని వ్యాక్సిన్లు వేసినా ప్రయో జనం కనబడటం లేదు. ఈ వ్యాధికి గురైన పశువులు మృతిచెందే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటి వరకు అన్నదాతలు వ్యవసాయంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ పాడి పరిశ్రమ మాత్రం వారిని నిలబెట్టింది. లంపి స్కిన్ వ్యాధితో పాడి పరిశ్రమ కూడా కుదేలైపోతుందని పాడి రైతులు ఆందోళన చెందు తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వ్యాధి నివారణ చర్యలు చేపట్టి పాడి రైతులను ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ముప్పాళ్ల పశువైద్యులు డాక్టర్ కరుణాకర్ రెడ్డిని వివరణ కోరగా మండలంలో సుమారు పది కేసుల వరకు లంపి స్కిన్ వ్యాధి సోకిన పశువులు ఉన్నట్లు చెప్పారు. ఈ వ్యాధికి ప్రత్యేకమైన వ్యాక్సిన్ లేదని గొర్రెలు,మేకలలో సోకే గోట్ పాక్స్ వ్యాధికి ఇచ్చే వ్యాక్సిన్‌నే ఇస్తున్నట్లు వివరించారు.



పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఒత్తిడిని పెంచేలా సెలవుల్లో తరగతులు

ప్రజాశక్తి - మంగళగిరి

విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని పెంచేలా సెలవు దినాల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్న చైతన్య, నారాయణ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎం. బాలాజి డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరిలోని చైతన్య, నారాయణ విద్యాసంస్థల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలుపుతూ మాట్లాడారు. వారానికి ఒకసారి వచ్చే ఆదివారం సెలవును కూడా అమలు చేయకపోతే విద్యార్థులు ఒత్తిడి నుండి ఎలా బయటపడతారని ఒత్తిడి వల్ల ఎదురయ్యే సమస్యలకు బాధ్యులు ఎవరని వారు ప్రశ్నించారు. దీని వల్ల పిల్లలు తల్లిదండ్రులతో ఎక్కువగా సమయం కేటాయించే పరిస్థితి ఉండదని ఫలితంగా వారి మధ్య దూరం పెరుగుతుందని అన్నారు. ఆదివారం సెలవును అమలు చేయాలని అడిగితే పొంతన లేని సమాధానం ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న చై... నా... విద్యా సంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ఐ నాయకులు మున్నా, సందీప్, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.



జూడో రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకార్ల ఎంపిక

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా జుడో అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డొంకరోడ్డులోని ఏఎస్ జుడో, కరాటే , ఫిట్‌నెస్ అకాడమీలో జిల్లా స్థాయి జూనియర్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ పోటీల్లో ఒక్కొక్క వెయిట్ కేటగిరీలో ప్రథమ స్థానం సాధించిన క్రీడాకారులు డిసెంబర్ 3, 4, 5వ తేదీల్లో కాకినాడలో డిఎస్ఎ నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ జుడో పోటీలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏపి సర్కిల్ పోలో సెక్రెటరీ పి.అరవింద్ మాట్లాడుతూ ఆత్మరక్షణ, ఆత్మస్థైర్యంతోపాటు, ఆరోగ్యం కూడా ఇలాంటి క్రీడ ద్వారా సాధిస్తామన్నారు. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏపీ, తెలంగాణ ఛైర్‌పర్సన్ బి.శారదా మాట్లాడుతూ ఈ క్రీడ మహిళలకు ఒక ఆయుధంగా మార్చుకోవటానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా జుడో అసోసియేషన్ అరవింద్, ఏపీ జుడో వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాంబాబు, ఎ.లక్ష్మిప్రసన్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు గ్రంథాలయంలో తనిఖీ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడులోని శాఖా గ్రంథలయంలో గుంటూరు గ్రంథాలయ శాఖాధికారి చిన్నసాని శ్రీనివాసరెడ్డి ఆదివారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. 4ఏళ్లకు సంబంధించి వివిధ ఫైల్స్‌ను పరిశీలించారు.అనంతరం తగు సూచనలు అందించి గ్రంథాలయ నిర్వహణ పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు సిఆర్‌డిఎ వద్ద పారిశుధ్య కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి - తుళ్లూరు

నాలుగు నెలలపెండింగ్ జీతాల కోసం,పని భద్రత కోసం సోమవారం విజయవాడ సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య,సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులుఎం రవి,ఎం భాగ్యరాజు తెలిపారు. ఆదివారం తుళ్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన 29 గ్రామాల పారిశుధ్య కార్మికుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జీతాలు చెల్లించకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో 38 రోజుల నుండి రాజధానిలో పారిశుధ్య కార్మికులు వివిధ రూపాలలో ఆందోళనలు చేశారని చెప్పారు. జనవరి నుండి రాజధానిలో పారిశుధ్య కార్మికులను తొలగించే విధంగా చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. జీతాలు చెల్లించక పోయినా, పని భద్రత లేకుండా చేసినా రానున్న ఎన్నికల్లో ప్రభుత్వం తగిన మూల్యం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చెల్లించుకోక తప్పదని వారన్నారు. రాజధాని పారిశుధ్య కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని, కార్మికులకు రాజధానిలోని ప్రజలందరూ సంఘీభావం తెలపాలని వారు కోరారు.సమావేశంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చెరుకూరి సుశీల,రాచూరి వేణు, సిఐటియు నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, అసెంబ్లీ,హైకోర్టు సిఐటియు నాయకులు గ్రేసు, శివజ్యోతి,పేరం బాబురావు పాల్గొన్నారు.

వర్సిటీలో కొనసాగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి-ఏఎన్‌యు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. రెండో రోజు యూత్ బాలుర విభాగంలో 49 కేజీల కేటగిరీలో ఎ.పృధ్వి (కడప), పి ప్రవీణ్ (తూర్పుగోదావరి), రేవంత్ సాయి (విజయనగరం), ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచారు. 55 కేజీల కేటగిరీలో గురు నాయుడు (విజయనగరం), డి వీరేష్ (కర్నూల్), సింహాచలం (కడప), సీనియర్ పురుషుల విభాగం 55 కేజీల కేటగిరీలో ఎస్ గురు నాయుడు (విజయనగరం), టి. కుమార స్వామి (పశ్చిమగోదావరి), డి వీరేష్ (కర్నూల్) ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు.

ఆకట్టుకున్న దేశ విదేశాల కరెన్సీ నాణేలు

ప్రజాశక్తి-తెనాలి

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఏర్పాటు చేసిన కరెన్సీ నాణేల ప్రదర్శన సభ్యులను ఆకట్టుకుంది. స్థానిక కవిరాజా పార్కులోని విజికె భవన్‌లో ఆదివారం సాయంత్రం అసోసియేషన్ సమావేశం అధ్యక్షులు మొవ్వా తస్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెలగా వీరయ్య దేశవిదేశాలకు చెందిన కరెన్సీ నోట్లు, నాణేల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. 1835 నుంచి 1947 బ్రిటిష్ పాలనలోని దమ్మిడి నుంచి రెండు అణాల వరకూ రాగినాణేలు, రెండు అణాల నుంచి రూపాయి వరకూ గల వెండి నాణేలు, 1950 నుంచి ఇప్పటివరకూ గల కాయిన్స్, నోట్స్, అలాగే 175 దేశాలకు చెందిన కరెన్సీ నోట్లను ప్రదర్శనగా ఉంచారు. సభ్యులు


కరెన్సీని పరిశీలిస్తున్న వెలగా వీరయ్య

ప్రదర్శనను విశేషంగా తిలకించారు. వీరయ్య మాట్లాడుతూ చిన్నతనం నుంచి నాణేలు, నోట్ల సేకరణ తన అభిరుచిగా చెప్పారు. కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, చలమయ్య, రామకృష్ణ, హనుమారెడ్డి, సీతారామయ్య, అబ్బయ్య పాల్గొన్నారు.

శారీర, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం


క్రీడాకారులతో పాఠశాల అధ్యాపకులు

ప్రజాశక్తి -పొన్నూరు రూరల్

క్రీడలు శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతగానో దోహద పడతాయని డాక్టర్ చేబ్రోలు పవన్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ థామస్ పాఠశాలలో గుంటూరు జిల్లా ఫెన్సింగ్ క్రీడలు అండర్-14 ,అండర్ -17 బాల బాలికల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. రాష్ట్ర ఆర్గనైజర్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు,రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రటరీ డి.కృష్ణఫర్ మాట్లాడుతూ వచ్చే నెల 6న వైయస్ఆర్ కడపలో జరుగు రాష్ట్రా స్థాయి పోటీలలో గుంటూరు జిల్లా తరుపు నుండి ఎంపికైన క్రీడాకారులు పాల్గొటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాయమ ఉపాధ్యాయ కార్యదర్శి యస్ కె. కరీముల్లా, పాఠశాల డైరెక్టర్ పిడి. థామస్ ,జిల్లా ఫెన్సింగ్ చైర్మన్ డి.క్రిస్టోఫర్, యల్. రాజేద్రప్రసాద్, ఫెన్సింగ్ నేషనల్ రిఫరీ డి. అశోక్ బాబు, పిడి. రకేష్ బాబు, టీచర్ మౌలాలి వై. సిహెచ్. రామరావు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎన్‌సిసి క్యాడెట్స్

కాలుష్యాన్ని తగ్గించాలని ర్యాలీ

ప్రజాశక్తి-తెనాలి

ఎన్‌సిసి డే సందర్భంగా పట్టణంలోని 22వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో క్యాడెట్స్ భారీ ర్యాలీ నిర్వహిచారు. సుబేదార్ సోహన్‌లాల్ సారధ్యంలో నిర్వహించిన ర్యాలీలో వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలని, పెట్రోల్ వినియోగం తగ్గాలని, ప్లాసిట్ వినయోగాన్ని నిషేదించాలని నినాదాలు చేస్తూ కరపత్రాలను పంచారు. ఎన్‌సిసి ఆఫీసర్ బెల్లంకొండ వెంకట్ క్యాడెట్స్‌తో ఫైరింగ్, డ్రిల్, ఆయుధ శిక్షణ, సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. 1948లో ఎన్‌సిసి ప్రారంభమైందని, 75 వసంతాలు పూర్తయ్యాయని వెంకట్ చెప్పారు . అలాగే వార్డు కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర పాల్గొని ఎన్‌సిసి క్యాడెట్లను అభినందంచి, వారికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్ సర్దార్ వంశీ కేర్‌టేకర్ విజయసింహ, పిఐ స్టాఫ్ శివానంద్, కృష్ణజ్యోతి, ముఖేష్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బైరగాని శ్రీనివాసరావు

గోనెసంచులు, పట్టాలు ఇవ్వండి..

ప్రజాశక్తి మంగళగిరి

ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో జరిగిన కౌలు రైతుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు కోతలకు వెనకాడుతున్నారని, మరో వారంలో వరి కోతలు ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. కొనుగోలుకు అవసరమైన గొనె సంచులను, పట్టాలను వెంటనే అందించాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కౌలు రైతులందరూ ఐక్యంగా తమ సమస్యల పరిష్కారం కోసం ముందుకు రావాలని, గతేడాది ఆర్బికేల ద్వారా ధాన్యం కొనకపోతే సంఘం ద్వారా ఆందోళన చేసి దాన్యం కొనేటట్లు చేసుకున్నామని గుర్తు చేశారు. అనంతరం కౌలు రైతు సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షులుగా చిలుకూరి వీరాంజనేయులు, కార్యదర్శిగా కె.హరిబాబు, ఉపాధ్యక్షులుగా చెన్నుపాటి సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా వి. జోజప్ప, కమిటీ సభ్యులుగా డి.బూచి బాబు, వి. హరిబాబు, టి.సంగయ్య ఎన్నికయ్యారు.

రోడ్డు ఆక్రమించి ఇంటి నిర్మాణం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు 28వ డివిజన్, వెంకటరమణ కాలనీ రెండో లైను, రెండో అడ్డరోడ్డులోసిమెంట్ రోడ్డు నిర్మాణం జరుపుతున్న సందర్భంగా మున్సిపల్ రోడ్డు ఆక్రమణలను తొలగించకుండానే రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో 10 అడుగుల రోడ్డు అక్రమణలకు గురైంది. స్థానిక మున్సిపల్ రోడ్డు వెడల్పు 25 అడుగులు కాగా 10 అడుగుల మేరకు అధికార పార్టీ నాయకులు అక్రమ నిర్మాణాలు చేశారు. ఈ ఆక్రమణలు తొలగించకుండానే ప్రస్తుతం ఈ వీధిలో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభమై డ్రైనేజీ పనులు కూడా పూర్తయ్యాయి. ఆక్రమణలు తొలగించాలని స్థానికులు గతంలో చాలాసార్లు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులపై మున్సిపల్ అధికారులు ఇంతవరకు స్పందించలేదు. సిమెంట్ రోడ్డు పనులకు 25 అడుగుల వెడల్పుతో మాత్రమే రోడ్డు నిర్మించాలని, రోడ్డును ఆక్రమించి కట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. లేనిపక్షంలో దీనిపై న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకోండి

ప్రొఫెసర్ కె.మాలకొండయ్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రతి విద్యార్థి సజనాత్మకతను పెంచుకోవాలని, సమయాన్ని వృథా చేయరాదని,మార్కులు కన్నా జ్ఞాన సముపార్జనకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రొఫెసర్ కే.మాలకొండయ్య హితవు పలికారు. గుంటూరు స్తంభాల గురువులో బండి సాహితి రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యస్‌వియస్ ఆర్‌కె రెడ్డి బాలికల హాస్టల్‌లో ఆదివారం వ్యక్తిత్వ వికాసం పై భౌతిక శాస్త్ర మాజీ ప్రొఫెసర్ కె.మాలకొండయ్య ప్రసంగించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ 104 సార్లు రాజ్యాంగ సవరణలు జరిగాయని, రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన శాసన వ్యవస్థ,రాజ్యాంగ వ్యవస్థ,పాలన వ్యవస్థలు అవినీతి మయం అయ్యాయని ఆరోపించారు. బండి సాహితీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండి అశోక్ రెడ్డి,రెడ్డి హాస్టల్ సెక్రెటరీ సుధారెడ్డి,అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి,మోదుగుల పాపిరెడ్డి, ఉడుముల శ్రీనివాస్ రెడ్డి,అప్పిరెడ్డి, సూరారెడ్డి పాల్గొన్నారు.

క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ప్రజాశక్తి- నరసరావుపేట

యువతను ఏకతాటిపైకి తీసుకొచ్చి, క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడమే ఎన్‌సిసి ముఖ్యఉద్దేశమని పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎస్.ఎస్.ఎన్ కళాశాలలో ఎన్.సి.సిఅధికారి మేజర్ బి.ఎస్.ఆర్ కె.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌సిసి 75వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అభ్యర్థులు పరేడ్ నిర్వహించి ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. ఎస్పీ మాట్లాడుతూ నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సిసి) అనేది భారత సాయుధ దళాల యొక్క యువ విభాగమని, దీని ప్రధాన కార్యాలయం భారతదేశంలోని న్యూ ఢిల్లీలో ఉందన్నారు. దేశంలోని యువతను క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా అభివృద్ధి చేయడంలో నిమగ్నమై ఉన్న ఆర్మీ, నేవీ,ఎయిర్ ఫోర్స్‌లతో కూడిన ట్రై-సర్వీసెస్ ఆర్గనైజేషన్‌గా, స్వచ్ఛంద ప్రాతిపదికన పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం దీనిని ఏర్పాటు చేశారన్నారు. దేశంలోని సైనిక యువత ఫౌండేషన్ అనేది హైస్కూల్స్ , హయ్యర్ సెకండరీ, కాలేజీలు, యూనివర్సిటీల నుండి క్యాడెట్‌లను నియమించే స్వచ్ఛంద సంస్థ అని వివరించారు. క్యాడెట్లకు చిన్న ఆయుధాలు , డ్రిల్‌లో ప్రాథమిక సైనిక శిక్షణ ఇస్తారని చెప్పారు. ఎన్‌సిసి విభాగంలో చేరడం వలన క్రమశిక్షణ, పట్టుదల, అంకిత భావం మొదలగు సుగుణాలు అలవడి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి దోహదపడతాయన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఎన్‌సిసి విభాగంలో శిక్షణ పొందిన అనేకమంది విద్యార్థులు నేడు అనేక ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. సభకు హాజరైన ప్రముఖులతో క్యాడెట్లు నిర్వహించిన పరేడ్‌ను పరిశీలించి, క్యాడెట్లకు బహుమతులు అందజేశారు. కళాశాలకు విద్యార్థులకు దిశా నిర్దేశం చేసిన ఎస్పీని కళాశాల అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్,కళాశాల కరస్పాండెంట్ నాగసరపు సుబ్బారాయ గుప్తా, డిఎస్పీ చిన విజయభాస్కరరావు, సిఐ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రవిశంకర్ రెడ్డి



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న క్యాడెట్లు



'కస్తూర్బా గాంధీ' లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-వినుకొండ

స్థానిక ఎన్ఎస్‌పి కాలనీలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్ హుస్సే న్ న్యాయవాదులతో కలసి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిం చారు.బార్ అసోసియేషన్ కోశాధికారిగా పివి రమణారెడ్డి అధ్యక్షత వహించారు. విద్యా హక్కు చట్టాల గురించి ప్రత్యేకంగా పోస్కో యాక్ట్,దిశ యాక్ట్, గురించి న్యాయవాదులు వివ రించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకొని అందరూ బాగా చదువుకోవాలని మంచి నడవడిక క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. అనంతరం హాస్టల్ ను, వంటగదిని, వండిన ఆహారాన్ని తనిఖీ చేశారు. హాస్టల్ లో ఏమైనా సమస్యలుంటే తెలపాలని చెప్పారు.



శ్రీ లక్ష్మీ అమ్మవారి పల్లకి సేవ..

ప్రజాశక్తి -దుర్గి

అడిగొప్పుల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఆదివారం పల్లకి సేవ నిర్వహించారు. ఈ మేరకు ఆలయ ముఖ్య కార్యనిర్వ హణాధికారి గిరిరాజ్ నరసింహబాబు ఒక ప్రకటన చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ లక్ష్మీ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు కుంకుమార్చన, చండీయాగం, నైవేద్యం సమర్పణ పలు కార్యక్రమాలను నిర్వహించగా సందర్శకులు తరలివచ్చారు. దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల ఆదే శాల మేరకు ప్రతి ఆదివారం శ్రీ లక్ష్మీ అమ్మవారికి ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం వివిధ రకాల నక్షత్ర హారతులు, సాయంత్రం పల్లకిసేవలను ఈఓ ఆధ్వర్యంలో నిర్వ హించారు. దేవస్థాన అర్చకులు, ఎన్మరులు, పరిచారికలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యడ్లపాడు

జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మసీదులో పేష్ ఇమామ్‌లకు ఆర్థిక సహాయం చేసే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ జాన్ సైదా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అన్ని మతాలలో ఉన్న పేద విద్యార్థులకు వారి ఉన్నత చదువులకు జాన్ సైదా సహాయం చేయటం గొప్ప విషయమని మండల వైసిపి మాజీ అధ్యక్షులు చల్లా విఘ్నేశ్వర రెడ్డి అన్నారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ జలాది సుబ్బారావు, ముస్లిం మత పెద్దలు వేటపాలెం సుభాని, అన్సార్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో మంత్రి రజిని పర్యటన

ప్రజాశక్తి - యడ్లపాడు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన ముస్లింలకు తమ ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని కోట, సంతపేట గ్రామాల్లో ఆదివారం ఆమె వివిధ శాఖల అధికారులు, పార్టీశ్రేణులతో కలిసి గడపగడపకు కార్య క్రమంలో పాల్గొన్నారు. నవరత్న పథకాల ద్వారా చేకూరిన లబ్ధి వివరాల కరపత్రాలను పంపిణీ చేశారు. మదర్సాను సందర్శించారు. మతపెద్దలు, విద్యార్థులతో ఆమె ముచ్చ టించారు. ఈ సందర్భంగా కొండవీడు కోట గ్రామాల ముస్లింలకు ప్రభుత్వం కేటాయిం చిన, పెండింగ్‌లో ఉన్న 1.56 ఎకరాల ఈద్గా భూమి సమస్యను పరిష్కరించాలని ముఫ్తిసాబ్ అజ్గర్‌అలిరషీది, మదరస సదర్ మహమ్మద్ అబ్దుల్ రహీమ్‌సాహెబ్



మం త్రికి విజ్ఞప్తి చేశారు. పంచాయతిలోని రెండు ముస్లిం కబరస్థాన్‌లు, ఎస్సీ స్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి, అలాగే కొత్త ఓవర్ హెడ్ ట్యాంక్, ఏళ్లనాటి పాత విద్యుత్తు తీగలను మార్చి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. వెంటనే స్పం దించిన మంత్రి సంబంధిత శాఖ అధికారులను సత్వరమే ఆయా పనులకు అంచనాలను సిద్ధం చేయాలని ఆదేశిం చారు. కోతుల బెడద అధికంగా ఉందని, గ్రామంలో 11 కెవి ట్రాన్స్‌ఫార్మర్ అవసరం ఉందని గ్రామస్తులు మంత్రి దృష్టికి తెచ్చారు.

పుస్తకాల వితరణ అభినందనీయం

ప్రజాశక్తి - మాచర్ల

ఎందరో పేద విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధపడేందుకు ప్రభుత్వ గ్రంథా లయాలు ఉపయోగపడతాయని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను వితరణగా ఇవ్వడం హర్షణీయమని మున్సిపల్ చైర్మన్ తురక కిషోర్ అన్నారు. మాచర్లలోని ప్రభుత్వ గ్రంథాలయానికి స్థానిక నవోదయ సైకిల్ షాప్ యజమాని రూ.10,000 విలువ చేసే పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలను ఆదివారం వితరణగా అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కటకం శేషగిరిరావు ముందుకు వచ్చి పుస్తకాలను వితరణగా ఇవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు ప్రభుత్వ లైబ్రరీకి తన వంతు సహకారం అందిస్తానని ఆయన చెప్పారు. లైబ్రరీ అభివృద్ధి కమిటీ చైర్మన్ పుల్లారావు మాట్లాడుతూ తాను కూడా



లైబ్రరీకి అవసరమైన విషయాలలో ముందుంటానని తనవంతు సహకారమందిస్తానన్నారు. దాత శేషగిరిరావు మాట్లా డుతూ గతంలో కూడా మిత్రుల సలహా మేరకు పలు పుస్తకాలు అందజేశానని, తన వంతు సహకారంగా ఎప్పుడు అవసరమైన ముందుంటానని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పి.నరసింహారావు, కాలేజీ లెక్చరర్ కె.ఆదినారాయణ, ఎంఈఓ వి.నాగయ్య, సంగీత విద్వాంసుడు లాలూ సాహెబ్, గ్రంథాలయ అధికారులు గోపి, సాంబశివురావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-నకరికల్లు

ఎంవి రెడ్డి హాస్పిటల్ వారిచే స్థానిక ఎంపి యుపి పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎం.వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 210 మందికి ఉచి తంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 40 మందికి కంటి శుక్లము ఉన్నట్లు గుర్తించారు. శుక్లము ఉన్న వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నరసరావుపేటలోని కోట సెంటర్‌లోని డాక్టర్ ఎంవీ రెడ్డి కంటి వైద్య శాలలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తామని వివేకానందరెడ్డి తెలిపారు. ఇటీవల పదహారు రోజుల పసిపాపకు తమ హాస్పిటల్‌లో కంటి ఆపరేషన్



విజయవంతంగా చేసినట్లు చెప్పారు. అప్పుడే పుట్టిన పిల్లల నుంచి అన్ని రకాల వయసు వారికి అధునాతన కంటి వైద్య సేవలు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు కోటేశ్వరరావు, ప్రసాద్ , హెడ్ కానిస్టేబుల్ నాయక్ ,హాస్పిటల్ మేనేజర్ రాజశేఖర్ రెడ్డి, సంగుల మల్లికార్జునరావు బాజీ సిబ్బంది పాల్గొన్నారు.

3న ఎన్టీఆర్, ఘంటసాల శతజయంతుత్సవాలు

ప్రజాశక్తి-వినుకొండ

ప్రముఖ కళా సంస్థ కళాసాగరి ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సం యుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 3న విశ్వవిఖ్యాత నట సార్వభౌములు పద్మశ్రీ నంద మూరి తారక రామారావు, గాన గంధర్వులు పద్మశ్రీ ఘంట సాల శత జయంతి ఉత్స వం వినుకొండలో నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాసాగని ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ 3వ తేదీ ఉదయం 9 గంటల నుండి స్థానిక జాషువా కళా ప్రాంగణంలో ఎన్టీఆర్ చలనచిత్రాలలోని రాష్ట్ర స్థాయి పాటల పోటీ, ఎన్టీఆర్ చలనచిత్ర జీవిత విశేషాలతో కూడిన క్విజ్ నిర్వహించనున్నారు. సాయంత్రం జరిగే సభా కార్యక్రమంలో ఎన్టీఆర్ చలనచిత్ర పురస్కారాన్ని సుప్రసిద్ధ సినీనటులు గిరిబాబు కు, ఎన్టీఆర్ సేవా పురస్కారాన్ని అసిస్ట్ ఇండియా డైరెక్టర్ జాస్తి రంగారావుకు, ఎన్టీఆర్ రంగస్థలం పురస్కారాన్ని గుమ్మడి గోపాలకృష్ణకు, ఘంటసాల స్మారక పురస్కారాన్ని నల్గొండకు చెందిన గాయకులు బుద్ధ శ్రీనివాస్‌కు అందజేయనున్నారు. రాష్ట్రంలోని సీనియర్ కళాకారులకు సత్కారం, పాటల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం జరగనుంది.

ఇళ్ల స్థలాల కోసం విగ్రహానికి వినతి

ప్రజాశక్తి-రాజుపాలెం

జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇళ్ల పట్టాలు ఉన్న జర్నలిస్టులకు గృహాలు మంజూరు చేయాలని కోరుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాజుపాలెం ప్రింట్ మీడియా యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజుపాలెం ప్రింట్ మీడియా అధ్యక్షులు రామిశెట్టి శ్రీనివాసరావు మాట్లా డుతూ ఇళ్ల స్థలాలు లేని వారికి తక్షణమే స్థలాలు మంజూరు చేయాలని, ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే అర్హులైన వారందరికీ జగనన్న గృహ నిర్మాణం పథకం కింద ఇళ్ల నిర్మాణం చేపట్టి సహకరించాలని అన్నారు.

రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నరసరావుపేట

వచ్చే నెల 7,8 తేదీలలో ఒంగోలులో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూని యన్ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మహాసభల వాల్‌పోస్టర్లను ఆది వారం ఆవిష్కరించారు. సమావేశంలో రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి. రాధా కృష్ణమూర్తి,నరసరావుపేట నియోజకవర్గం ఏరియా కార్యదర్శి వి.వెంకట్, డేవిడ్, జక్రం తదితరులు పాల్గొన్నారు.



వినుకొండ: స్థానిక శివయ్య భవన్ ఎఐటియుసి కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్ మాట్లాడుతూ ఈ మహాసభలలో రాష్ట్రంలోని ప్రతినిధులు అందరూ పాల్గొంటున్నారని, పల్నాడు జిల్లాలోని మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, మూడున్నరేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో నిర్మాణ కార్మిలకు చేసిందేమీ లేకపోగా, ఉన్న ఉపాధి ఊడగొట్టారని సిఐటియు గుంటూరు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం గుజ్జనగుండ్లలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ నగర పశ్చిమ కమిటీ 10వ మహాసభ షేక్.బాషా అధ్యక్షతన జరిగింది. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించారని, దీంతో పనులు లేక కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. కరోనా మహమ్మారితో కుటుంబాలు గడవటం కూడా కష్టంగా ఉన్న సమయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి సహాయం చేయలేదని విమర్శించారు. కార్మికుల సంక్షేమానికి ఏర్పాటు చేసిన బోర్డు నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. కార్మికుల నిధులు కార్మికుల కోసం ఖర్చుచేయాలని కోరుతున్నా ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందని మండిపడ్డారు. కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమించి సంక్షేమ బోర్డును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. మహాసభలో కమిటీ ప్రధాన కార్యదర్శి ఆది నికల్సన్ మాట్లాడుతూ గత 3 ఏళ్ల కాలంలో చేపట్టిన కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. సభలో సిఐటియు నగర పశ్చిమ, తూర్పు నగర కమిటీల ప్రధాన కార్యదర్శులు బి.ముత్యాలరావు, కె.శ్రీనివాసరావు, జిల్లా కమిటి సభ్యులు కె.నళినీకాంత్, భవన నిర్మాణ కార్మిక సంఘం తూర్పు ప్రధాన కార్యదర్శి చింతల శ్రీనివాసరావు, గుంటూరు నగర ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీతారమయ్య, పెయింటర్స్ యూనియన్ నాయకులు గోనె లూథర్‌పాల్, సీనియర్ నాయకులు డి.మస్తాన్ తదితరులు ప్రసంగించారు. అనంతరం మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఆది నికల్సన్, అధ్యక్షులుగా దొడ్డా కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాశింవలి, కోశాధికారిగా సీపాన పద్మనాభుడు, ఎ.రంగా, మరో 26 మందితో కమిటిని ఎన్నుకున్నారు.



సభలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

రాష్ట్రస్థాయి పోటీలకు సీతారామమూర్తి

ప్రజాశక్తి -దుగ్గిరాల


దివి సీతారామమూర్తి

మండలంలోని ఈమని గ్రామానికి చెందిన క్రీడాకారుడు దివి సీతారామమూర్తి ఆదివారం గుంటూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ వారు నిర్వహించిన పోటీల్లో 65 ఏళ్లు పైబడిన వారి విభాగంలో ఆయన లాంగ్ జంప్ ,హార్డిల్స్ ట్రిపుల్ జంప్ విభాగంలో విజేతగా నిలిచారు. డిసెంబర్ 15, 16 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారు. ఈ సందర్భంగా ఆయనకు మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి చుక్క కొండయ్య, అధ్యక్షులు కంచర్ల ఆనంద్, బాలయ్య తదితరులు అభినందించారు.



వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలుగ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వంగ వీటి మోహన రంగా విగ్రహాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా బడుగు వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. పేదల కోసం నిత్యం పరితపించేవాడని అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని చేబ్రోలులో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు,అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హెల్త్ అండ్ ఫిట్‌నెస్‌పై అవగాహన

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక చెంచుపేట ఏఎస్ఎన్ ఇండోర్ స్టేడియం ఆవరణలో స్పోర్ట్స్ అధారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, రిటైర్డ్ ఆర్మీ ఎంప్లాయీస్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాపారులు, గృహిణులు, మెప్మా గ్రూపు మహిళలకు ఆదివారం హెల్త్ అండ్ ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. డిఎస్పీ కె.స్రవంతిరాయ్ ముఖ్యఅతిథిగా పాల్గొని అవగాహన సదస్సును ప్రారంభించారు. సంపూర్ణ ఆరోగ్యానికి శారీరక, మానసిక వ్యాయామంపై స్టేడియం ఇన్‌చార్జి కె.కోటేశ్వరావు, హ్యాండ్‌బాల్ కోచ్ నాగరాజు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికోద్యోగులు నారాయణం కమల్‌కుమార్, ఏడుకొండలు, కె.మహారాజు పాల్గొన్నారు.

సాహితీ ప్రపంచంలో చెరగని ముద్ర వేసిన బొల్లిముంత


బొల్లిముంత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహక బృందం

ప్రజాశక్తి-తెనాలి

సాహితీ ప్రపంచంలో బొల్లిముంత శివరామకృష్ణ చెరగని ముద్ర వేశారని ప్రముఖ రచయిత అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోలి సీతారామయ్య అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని బొల్లిముంత ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, ఏపి ప్రజానాట్యమండలి, ఇస్కస్ సంయుక్త ఆధ్వర్యంలో బొల్లిముంత జయంతోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ నాయకులు కె.బెన్వర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత బొల్లిముంత చిత్రపటానికి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీతారామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, ఉద్యమకారుడిగా, సాహితీవేత్తగా, రచయితగా బొల్లిముంత బహుముఖ ప్రతిభను చాటారన్నారు. చలనచిత్ర రంగంలో 40కి పైగా చిత్రాలకు సంభాషణలు రచించారని కొనియాడారు. కార్యక్రమంలో దర్శకులు కనపర్తి రత్నాకర్, రంగిశెట్టి రమేష్, ఏఐటియూసి అధ్యక్షులు ఎస్.గురుబ్రహ్మం, ప్రొఫెసర్ శేషిరెడ్డి, ఎంవి రఘునాధరావు, గరికపాటి సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, వసంతయామిని, బెజ్జంకి నాగమణి, విజయదుర్గ, నగరాజకుమారి, ఇస్కస్ నాయకులు ఎం.శ్రీకాంత్, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

నొప్పులకు మందులతో పని లేకుండా ఫిజియోథెరపి

ప్రజాశక్తి-గుంటూరు

ఎలాంటి మందుల ప్రమేయం లేని చికిత్స అయిన ఫిజియోథెరపి శారీరకంగా వచ్చే నొప్పులను నివారిస్తుందని గుంటూరు ఫిజియో థెరపి అధినేత డాక్టర్ వి.సుజాత అన్నారు. అవగాహన సంస్థ ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ సుజాత మాట్లాడారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సుజాత మాట్లాడుతూ మందుల కోసం మనుషులా, మనుషుల కోసం మందులా అన్నట్లు ఉన్న ఈ రోజుల్లో మందుల ప్రమేయం లేని వైద్యం కావాలనుకునే వారు ఫిజియోథెరపి వైద్యం చేయించుకోవాలన్నారు. నొప్పుల బిళ్లల వల్ల మూత్రపిండాల సమస్యలు, అల్సర్లు వస్తాయని, శరీరంలో ఉండే రోగనిరోధక శక్తి క్షీణిస్తుందన్నారు.శారీరక నొప్పులను నివారించటానికి అధునాతన పరికరాలతోపాటు కండరాలు, కీళ్లు, నరాల సామర్థ్యాన్ని పెంచటానికి ఎక్సర్‌సైజుల ద్వారా ఫిజియోథెరపి వైద్య విధానంలో చికిత్స చేయబడుతుందన్నారు. అనంతరం సంస్థ సభ్యులు డాక్టర్ సుజాతను సత్కరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, సాయిరాం, చంద్రయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుజాత


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఎస్ రామకృష్ణ, తదితరులు

10న వినుకొండలో చిత్రకళా ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు

బెజవాడ చారిటబుల్ ట్రస్ట్, కెకె మిత్రమండలి సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 10న వినుకొండ నిర్మల గరల్స్ హైస్కూల్లో నిర్వహిస్తున్న చిత్ర కళా ప్రదర్శనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ రామకృష్ణ కోరారు. ఆదివారం గుంటూరులోని ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేరెన్నికగన్న చిత్రకారుల చిత్రాలతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేయటం జరుగుతుందని బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బి.వి.నాగేశ్వరరావు తెలిపారు. అలాగే చిత్రకళారంగంలో అంతర్జాతీయ అవార్డులు సాధించిన దాకోజు శివప్రసాద్, సి.కోటేష్ ద్వారా లైవ్ ఆర్ట్ డెమో ఉంటుందన్నారు. పాఠశాలల విద్యార్థులకు చిత్రకళా పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బంగారు, వెండి, కాంస్యపతకాలు, నగదు బహుమతులు ఇస్తామన్నారు. పాల్గొనదలిచిన వారు 9848469694 నంబరులో సంప్రదించాలన్నారు. ఎంట్రీ ఫీజు రూ.50లు చెల్లించాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు మాత్రమే గీయాలన్నారు. కార్యక్రమంలో జాతీయ చిత్రకారుడు వజ్రగిరి జస్టిస్, ఉపాధ్యాయులు పి.సాయివిశ్వనాథ్, బి.హైమారావు, జగదీష్, ఆంటోనియో, తదితరులు పాల్గొన్నారు.


కుటుంబసభ్యులతో నవజీవన్ బాలభవన్ నిర్వాహకులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి

నవజీవన్ బాలభవన్ విజయవాడ ఆధ్వర్యంలో చిగురు ఆశ్రమంలో నవజీవన్ పూర్వవిద్యార్థుల కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్నకుమార్ మాట్లాడుతూ ఒక వ్యక్తి పెరుగుదలకు కుటుంబమే ప్రముఖపాత్ర వహిస్తుందని చెప్పారు. తమ సంస్థ బాలల అభివృద్ధి, కుటుంబ సంక్షేమంకోసం పనిచేస్తుందని తెలిపారు. ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్ళమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల కుటుంబాలందరూ ఒక్కచోట కలవడం ఆనందంగా ఉందని చెప్పారు.ఈ కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఫాదర్ అంకయ్య, జోనల్ కోఆర్డినేటర్ వసంతకుమారి, జె.ఆంజనేయులు, బి.రమేష్, కె.వాణి, కె.ప్రియాంక, శ్రీవల్లి, నవజీవన్ పూర్వ విద్యార్థినీ విద్యార్థులు వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంచుతున్న నాయకులు

'వైసిపి ప్రభుత్వంలో మైనార్టీల పట్ల వివక్ష'

ప్రజాశక్తి -మంగళగిరి

వైసీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల పట్ల వివక్షత చూపుతుందని టిడిపి నియోజకవర్గ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ ఖాదర్ బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని 26వ వార్డులో జగన్‌కు హటావో-బాబుకు బులావో లోకేష్‌కు జీతావో అనే నినాదంతో ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం మైనార్టీ నాయకులు మాట్లాడుతూ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ముస్లింలకు లోన్లు కూడా జగన్ ప్రభుత్వ హయాంలో ఇవ్వలేదని విమర్శించారు. మంగళగిరి పట్టణంలో ముస్లింల వార్డుల్లో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు టి.జానకి దేవి, దామర్ల రాజు, మైనార్టీ నాయకులు షేక్ రియాజ్, ఎండి ఇబ్రహీం, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దానబోయిన సుందరరావుయాదవ్

'బీసీలను మోసం చేయడం మానుకోండి'

ప్రజాశక్తి - తాడేపల్లి

ఆత్మీయ సమావేశాల పేరుతో వైసిపి బిసిలను మోసం చేయడం మానుకోవాలని రాష్ట్ర టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు విమర్శించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 56శాతం మంది బిసిలు 139 కులాలుగా ఉంటే 56కార్పోరేషన్‌లు చేసి ఒక్కరూపాయి నిధులు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో గుంటూరు పార్లమెంటు అధికార ప్రతినిధి ఢిల్లీ రామారావు, చల్లా శ్రీను, సిహెచ్.శివుడు, కె.సాయిచంద్, ఎ.కుసుమ, టి.గోపి, డి.కుమార్, పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రోశయ్యను సన్మానిస్తున్న క్రెడాయ్ సభ్యులు

క్రెడాయ్ ప్రాపర్టీషో అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజల సౌలభ్యం కోసం క్రెడాయ్ ప్రాపర్టీ షో ఏర్పాటు చేయటం అభినందనీయమని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య అన్నారు. క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ స్థానిక రింగురోడ్డు, సిద్ధార్థ గార్డెన్స్‌లో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ప్రాపర్టీషోను ఆదివారం పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన గృహం కొనుగోలు చేయాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రెడాయ్ గుంటూరు ఛాప్టర్ అధ్యక్షులు మామిడి రాము మాట్లాడుతూ ప్రాపర్టీషోకు గుంటూరు ప్రజల నుండి మంచి స్పందన లభించిందన్నారు. అధునాతన టెక్నాలజీతో, కష్టమర్లకు నచ్చే విధంగా క్రెడాయ్ గుంటూరు ఇండిపెండెంట్ ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాస్, గేటెడ్ కమ్యూనిటీ వెంచర్లు, ఫ్లాట్స్ అందరికీ అందుబాటులో ధరల్లో ఉంచినట్లు తెలిపారు. క్రెడాయ్ స్టేట్ అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ ఫ్లాట్స్ బుక్ చేసుకునే వారికి ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తదితర బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. క్రెడాయ్ ఛైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాపర్టీషో అమ్మకందారుడికి, కొనుగోలు దారుడికి చక్కని వేదిక అన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ తియ్యగూర వినోద్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో నేటి నుంచి ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-తెనాలి : మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి ధాన్యం కొనుగోలు ప్రాంరభమవుతుందని మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ ఆదివారం తెలిపారు. ఆర్బీకేల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు, హార్టీకల్చర్ సహాయకులు, ఎంపిఈవోలు అందుబాటులో ఉంటారన్నారు. వరి సాధరణ రకం 75 కిలోల బస్తా రూ.1530, 'ఎ' గ్రేడ్ రకం రూ.1545కు కొనుగోలు చేస్తారన్నారు. తేమ 17 శాతం వరకూ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు గమనించి, రైతు భరోసా కేంద్రాల ద్వారానే విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు.

24 గంటల్లోనే రైతులకు సొమ్ము



- మిర్చి యార్డులో పక్కాగా ఈ-నామ్
- జనవరి నుంచి కొత్త సరుకు ఆగమనం
- దిగుబడి తగ్గడం వల్ల ధరలు పెరుగుదల
- ప్రజాశక్తితో మిర్చి యార్డు ఛైర్మన్ వెంకటేశ్వరరెడ్డి



గుంటూరు

మిర్చి యార్డులో ఈ-నామ్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తూ రైతులకు 24 గంటల్లో సొమ్ము చెల్లిస్తున్నామని యార్డు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన వ్యాపారులు ఈ-నామ్‌లో ఎక్కువ మంది పాల్గొనకపోయినా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రయ విక్రయాలు నమోదు చేస్తున్నామని చెప్పారు. రైతుల నుంచి సరుకు తీసుకున్న 24 గంటలలోగా వ్యాపారులు రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నారన్నారు. ఈ ఏడాది కొత్త సరుకు జనవరి మొదటి వారం నుంచి వస్తుందని ఆశిస్తున్నామని, ప్రస్తుతం కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉన్న సరుకు విక్రయాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు తెలిపారు.

ఈ ఏడాది సీజన్ ఎప్పటి నుంచి ప్రారంభం అవుతుంది?

మిర్చిసాగు ఈ ఏడాది కొంత జాప్యమైంది. కోతలింకా పూర్తిగా ప్రారంభం కాలేదు. వచ్చే జనవరి మొదటి వారం తర్వాత సరుకు యార్డుకు వస్తుందని భావిస్తున్నాం. రాయలసీమ, పల్నాడు, కృష్ణా జిల్లాల్లో డిసెంబరు రెండో వారం నుంచి తొలివిడత కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ప్రస్తుతం జరుగుతున్న విక్రయాలు?

గత సీజన్‌లో పండిన సరుకు నిల్వలు కోల్డ్ స్టోరేజీల్లో ఉన్నాయి. వీటినే ఆరు నెలలుగా విక్రయిస్తున్నారు. ఇంకా 20 లక్షల టిక్కీలు నిల్వ ఉన్నాయి. గతేడాది తామర తెగులు వల్ల దిగుబడి తగ్గినా ధరలు ఆశాజనకంగా ఉండటం వల్ల రైతులుకొంత సంతృప్తిగా ఉన్నారు. తెగుళ్ల సమస్య వల్ల దిగుబడి తగ్గడంతో ధరలు పెరిగాయి. ప్రస్తుతం యార్డుకు ప్రతి రోజు 35-45 వేల బస్తాల వరకు వస్తున్నాయి. కనీస ధర రూ.20 వేల వరకు ఉంటోంది.

గత మూడేళ్లలో జరిగిన లావాదేవీల వివరాలు?

2019-20లో 1.26 కోట్ల టిక్కీలు రాగా 2020-21లో కరోనా ప్రభావంతో 93.39 లక్షల టిక్కీలు వచ్చాయి. అయితే 2021-22లో ఇప్పటి వరకు 1.30 కోట్ల టిక్కీలు వచ్చాయి. 2022-23లో ఇప్పటి వరకు 66.60 లక్షల టిక్కీలే వచ్చాయి. ఈ ఏడాది తక్కువ దిగుబడి ఉన్నా ధరల ఆశాజనకంగా ఉండటం వల్ల రైతులు ఎక్కువగా యార్డుకు వస్తున్నారు.

దిగుబడి తగ్గినా రద్దీ కొనసాగడానికి కారణం?

కర్నూలు, అనంతపురం, బళ్లారి, తెలంగాణలో భద్రాచలం, ఖమ్మం జిల్లాల నుంచి ఎక్కువగా మిర్చి గుంటూరుకు వస్తుంది. గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో తామర తెగులు తట్టుకుని నిలదొక్కుకున్న మిర్చి దిగుబడి ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఎక్కువగా వచ్చింది. ఈ సరుకు ఎక్కువ మంది కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు.

ఎగుమతులు ఎలా ఉన్నాయి?

ప్రస్తుతం ఇతర దేశాలకు ఎగుమతులు నిలిచిపోయా. శ్రీలంకలో ఆర్థిక సంక్షోభం వల్ల ఎగుమతులు ఆగిపోయాయి. ఇండోనేషియా, బంగ్లాదేశ్‌కు కూడా ఎగుమతులు లేవు. బంగ్లాదేశ్‌కు కూడా ఎగుమతి నిలిపివేయడం వల్ల అక్కడి నుంచి ఇతర దేశాలకు సరుకువెళ్లడం లేదు. దేశీయ అవసరాలకే ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళులు



కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆలపాటి తదితరులు

ప్రజాశక్తి-తెనాలి రూరల్

సూపర్‌స్టార్ కృష్ణ సంస్మరణ సభను బుర్రిపాలెం రోడ్డులో ఆదివారం శాఖమూరి చందు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తొలుత కృష్ణ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుర్రిపాలెం పేరును ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప నటులు కృష్ణ అని కొనియాడారు. కృష్ణ మృతి చిత్రపరిశ్రమతో పాటు తెనాలి కళారంగానికి తీరని లోటన్నారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎ.వెంకటేశ్వరరావు, ఎస్.మదన్, కె.మురళి, జె.రేణుక, ఇ.వెంకటపూర్ణచంద్, ఎస్.శ్రీను, టి.హరిప్రసాద్, బి.సాంబయ్య, ఎ.శ్రీకాంత్, పి.వెంకటేశ్వరరావు, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో కృష్ణ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. వేదిక అధ్యక్షులు కె.వెంకటేశ్వరరెడ్డి, ఎస్టీయు జిల్లా అధ్యక్షులు జి.మోహనరావు మాట్లాడారు. జె.కోటేశ్వరావు, ఎ.విజేంద్రరావు, కోటయ్య, సల్మాన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని జయలక్ష్మీ మూవీల్యాండ్ థియేటర్‌లో కృష్ణ సంతాప సభ నిర్వహించారు. థియేటర్ యజమాని హరిదాసు శ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం థియేటర్‌లో తొలి నుండి పని చేస్తున్న కార్మికుడు కారుచోల ముసలయ్యను సత్కరించారు. తొలుత థియేటర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కృష్ణ భారీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. థియేటర్ నిర్వాహకులు కొలికినేని రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక శివయ్య స్తూపం సెంటర్లో కృష్ణ - మహేష్‌బాబు అభిమానుల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పివి సురేష్‌బాబు మాట్లాడారు. కృష్ణ విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయాలని కోరుతూ, కృష్ణ అభిమానులు కష్టాల్లో ఉంటే వారినీ ఆదుకునేలా ప్రతినెలా కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. కౌన్సిలర్ మార్కెట్ నన్నేసా, లక్ష్మీనారాయణ, టి.శ్రీను, ముస్తఫా, బాషా, ఎం.పూర్ణబాజీ, శివరామయ్య పాల్గొన్నారు.



యడ్లపాడు జయలక్ష్మీ మూవీల్యాండ్ థియేటర్‌లో



వినుకొండలో అన్నదానం



పెదనందిపాడులో నివాళులు



నీటి ప్రవాహానికి కాల్వలో అడ్డుగా ఉన్న జమ్ము, ముళ్ల కంప, పిచ్చి మొక్కలు

నీరు పారని మేజర్ కాల్వ

మరమ్మతుల కోసం రైతుల వేడుకోలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

నాగార్జునసాగర్ కెనాల్ పరిధిలోని మల్లాయపాలెం మేజర్ కాలువలో జమ్ము, గుర్రపు డెక్క, ముళ్ళకంప వంటివి పెరిగి నీటి పారుదలకు తీవ్ర ఆటంకంగా ఉన్నాయని పలువురు రైతులు ప్రజాశక్తి వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలువ పెదనందిపాడు మండలంలో అన్నపర్రు, ఏబీ పాలెం, వరగాని, కట్రపాడు, పుసులూరు, గోగులమూడి, రావిపాడు పత్తిపాడు మండలంలో మల్లాయపాలెం, వంగిపురం, మేడవారిపాలెం గ్రామాలలో సాగునీటికి ఈ కాలువ ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం మిర్చి పంటకు, పొగాకు, ఆరుతడి పంటలకు నీళ్లు పెట్టుకునే సమయమని, కాల్వలో పారుదల సరిగా లేకపోవడం వల్ల చివరి గ్రామాలకు నీరు సరిగా అందడం లేదన్నారు. కాలువ కట్టకు ఇరువైపులా అడవి తుమ్మ, రేగు కంప, నూగుబెండ వంటివి పెరిగి అడవిలా ఉండటంతో వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. గత నాలుగు సంవత్సరాల నుండి నీటి పారుదల శాఖ అధికారులు కాల్వ మరమ్మతు పనులు చేపట్టలేదన్నారు. వెంటనే జిల్లా అధికారులు జోక్యం చేసుకుని కాల్వ మరమ్మతు పనులు చేయించి మల్లాయపాలెం మేజర్ ఆయుకట్ట రైతులన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.